క్లుప్తంగా

పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ దేవకుమార్

బాడంగి: పంచాయతీలు సొంత ఆదాయాన్ని వృద్ధి చేసుకుని స్వయంసమృద్ధి సాధించుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ పి. దేవకుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఆదాయ సముపార్జనపై రెండురోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆదాయ వనరుల సమీకరణపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, టీఓటీలు జయప్రకాష్, బంగారుబాబు, ఎస్వీ కృష్ణవేణి, ఎం.రవీంద్ర, సర్పంచ్‌లు, డీఏలు, ఈఏలు పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం


అంతకాపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ చిన్నంనాయుడు

రాజాం: గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూడీ ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి, ఒమ్మి, ఎంజే వలస, సోపేరు, గుయ్యానవలస గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా కలుషిత నీరు


కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు

మెంటాడ: మండలంలోని జయితిలో వీధి కుళాయిల నుంచి మురుగునీరు వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు శనివారం మాట్లాడుతూ.. గ్రామంలో రెండు రక్షిత మంచినీటి పథకాలున్నా.. సరైన పర్యవేక్షణ లేక ఇలా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

సర్వే తప్పనిసరి

- మున్సిపల్ ఆర్డీ రవీంద్ర


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీ రవీంద్ర

బొబ్బిలి: ఇంటి పన్ను శతశాతం వసూలుకుగాను ఇళ్ల సర్వే తప్పనిసరిగా చేట్టాలని మున్సిపల్ ఆర్డీ వి. రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న పన్నులు చెల్లిస్తున్న ఇళ్లను పరిశీలించి, అదనపు కొలతలున్నాయేమో చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎల్. రామలక్ష్మి, ఆర్వో నాగరాజు, ఆర్ఐ పి. సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట జెడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హిందీ స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం వేణుగోపాల్ శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరళమైన రీతిలో అందరికీ అర్థమయ్యేలా మెటీరియల్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో హిందీ టీచర్ ఎం.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

వంగర: మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తగ్గుముఖం పట్టని వరద

- రోడ్డుపైనే వరదనీరు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


పీహెచ్‌సీ చుట్టూ చేరిన వరదనీరు


రేగిడి: చెరకు పంటలో చేరిన నీరు


రేగిడి ఉన్నత పాఠశాలలోకి చేరిన వరదనీరు


వరద నీటిలో చిన్నారుల అవస్థలు


వెంకటపేట వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణలత


రాజాం : పానుగుటివలస సమీపంలో పత్తి పంటలోకి చేరిన నీరు

రేగిడి: మండల కేంద్రంలోని రేగిడి గ్రామం రెండు రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాయన్న చానల్, ఆకుల లోవకట్ట గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో గ్రామం చుట్టూ వరదనీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శనివారం కూడా వరద ప్రవాహం అధికంగా ఉండడంతో ఇళ్లల్లోకి, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వరదనీరు చేరుకుంది. పీహెచ్‌సీకి వైద్యాధికారులు, సిబ్బంది అతి కష్టంమీద నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లారు. రోగులు కూడా ఇబ్బంది పడ్డారు. అలాగే వెంకంపేట వెళ్లే ప్రధాన రహదారిపై వరద ప్రవహించింది. తహసీల్దార్ ఐ.కృష్ణలత వరద ప్రవాహన్ని పరిశీలించి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా చూడాలని వీఆర్వో, వీఆర్ఏలకు సూచనలు చేశారు.

పత్తి పంటకు నష్టం..

రాజాం: అధిక వర్షాలు కారణంగా పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రస్తుతం 260 ఎకరాల్లో పత్తి పంట సాగులో ఉంది. అమరాం, గడిముడిదాం, మొగిలివలస, గార్రాజుచీపురుపల్లి, గెడ్డవలస, ఒమ్మి, బొమ్మినాయుడువలస, కొత్తవలస, గురవాం, పొనుగుటివలస, తదితర ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో పువ్వు, పిందె ఎదుగుదల మందగించింది. సంబంధిత అధికారులు పర్యటించి నష్ట నివారణ చర్యలు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

నిధులున్నా ఎందుకు పనులు చేయరు..!

- ఆర్అండ్‌బీ అధికారులను నిలదీసిన సభ్యులు


రోడ్లు బాగుచేయాలని ఆర్అండ్‌బీ ఏఈని ప్రశ్నిస్తున్న అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల

రేగిడి: రోడ్లు బాగుచేసేందుకు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, సంబంధిత కాంట్రాక్టర్లచే పనులు ఎందుకు చేయించడం లేదని ఆర్అండ్‌బీ అధికారులను సభ్యులు ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దార అప్పలనర్సమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ శాఖపై జరిగిన చర్చలో ఏఈ కె.సతీష్ కుమార్ మాట్లాడుతుండగా.. అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల కలుగజేసుకుని ఉంగరాడమెట్ట – మజ్జిరాముడపేట ప్రధాన కూడళ్ల వద్ద సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో పలుమార్లు రహదారుల మరమ్మతుల విషయమై చర్చించినా అధికారులు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు మండిపడ్డారు. ప్రధాన రోడ్డుకు సంబంధించి రూ. 8.82 కోట్లు మంజూరవ్వగా.. రూ. 4 కోట్లు ఇప్పటికే కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు ఏఈ సతీష్‌కుమార్ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు సైతం మరమ్మతులు చేపట్టాలని ఉప్పర్నాయుడువలస, కొర్లవలస ఎంపీటీసీ సభ్యులు పాగిరి అప్పలనాయుడు, బంకి హరనాథ్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో ఏఈ వావిలపలిల సురేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ సమస్యల్లేకుండా చూస్తున్నామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతంతమాత్రంగానే ఉందని చిన్నశిర్లాం, బూరాడ, కొర్లవలస, ఆమదాలవలస సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, వావిలపల్లి శశిభూషణరావు, బంకి చంద్రశేఖర్, కుమిలి అప్పారావు ఏఈని ప్రశ్నించారు. అనంతరం వైద్య, ఆరోగ్యం, వెలుగు, హౌసింగ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్య, ఉపాధిహామీ, తదితర శాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఏపీఎం బి.గోవిందరావు, ఏపీఓ ఎస్.హరనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


సుబ్బినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు


వంగర: అరసాడలో అప్పలస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నాయకులు

రేగిడి: మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన వంజరాపు సుబ్బినాయుడు ఈ నెల 3న గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మృతుడి భార్య లక్ష్మిని ఓదార్చారు. పరామర్శలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు చుక్క వెంకటినాయుడు, వంగర మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, తునివాడ, పోరాం ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, బొక్కెల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అరసాడలో..

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జరజాపు అప్పలస్వామి ఇటీవల మృతిచెందడంతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ పువ్వాన సత్యనారాయణ, రేగిడి వైస్ ఎంపీపీలు వావిలపల్లి జగన్ మోహనరావు, టంకాల అచ్చెంనాయుడు, అరసాడ సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారాయణ, పార్టీ నాయకులు ఎస్.బలరాంనాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, కోరాడ జగన్నాథరావు, ముని వెంకటరావు, కంబాల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ



రేగిడిలో బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు


రాజాం సిటీ: బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు


వంగర: బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

రేగిడి: ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సీ నుంచి ఉంగరాడమెట్ట వరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వావిలపల్లి తారకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శెట్టి శివరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మురపాక వెంకటరమణ, జిల్లా కార్యదర్శి ఎందువ సీతంనాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మీసాల సత్యంనాయుడు, ఎందువ రామకృష్ణ, వంజరాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఏలు విడుదల చేయండి..

రాజాం సిటీ: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న విజయవాడలో చేపట్టనున్న పోరుబాటను విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు మజ్జి మదన్‌మోహన్, పక్కి వాసు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పేకేటి రామారావు, వై.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.రమేష్, డోల వాసు, ఎ.సన్యాసినాయుడు, పి.వేణుగోపాల్, బీవీ అచ్యుతరావు, ఎస్.మధు, వీఎస్ఎస్ కాశీనాథ్, ఎస్.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట విజయవంతం చేయాలి..

వంగర: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు కె.రమణ, ఎల్.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, వై.భాస్కరరావు, పి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

నెలవారీ భృతి కల్పించాలి

రాజాం సిటీ: ఫ్రీ బస్సు పథకం వలన ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం నెలవారీ జీవన భృతి కల్పించి ఆదుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆటో డ్రైవర్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కోటి, నారాయణరావు, ఈశ్వరరావు, రఘు, సూర్యారావు, పాపారావు, సురేష్, జగదీష్, శ్రీను, రమేష్, రాంబాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

- సీఐ నారాయణరావు


మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కె. నారాయణరావు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, తదితర ప్రచార మాధ్యమాలలో వ్యక్తిగతంగా గాని, రాజకీయంగా గాని, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రచారాలు చేయడం ఐటీయాక్ట్ ప్రకారం నేరమన్నారు. సోషల్ మీడియాపై నిఘా పెంచామని.. ఇతరుల గౌరవానికి భంగం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎస్సై వి. ప్రసాదరావు ఉన్నారు.

సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని ఆటోడ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వం ఏడాదికి రూ. 15 వేలు అందజేస్తోందన్నా రు. కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునా యుడు, మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు, ఆర్డీఓ వీవీ మోహనరావు, తహసీల్దార్ ఎం. శ్రీను, ఎంపీఐ శశి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ ఏజెంట్ల వివరాలివ్వండి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ రామమోహనరావు

బొబ్బిలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఒక పోలింగ్ ఏజెంట్ వివరాలను రెండు రోజుల్లో అందివ్వాలని ఆర్డీఓ జేవీవీఎస్ రామమోహనరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కమిషన్ ఆదేశాల ప్రకారం అందరూ నడచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని.. అన్ని పార్టీల వారు పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలను తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు రద్దు చేయండి


మాట్లాడుతున్న వెంకటనాయుడు, బలరామినాయుడు

బొబ్బిలి: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. బలరామినాయుడు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ డి. వెంకటనాయుడు డిమాండ్ చేశారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ రూల్స్, పెండింగ్ డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

రీసర్వేపై అవగాహన పెంచుకోవాలి


బాడంగి: మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్


రేగిడి: చాటాయివలసలో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు

బాడంగి: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ కె.వరప్రసాదరావు కోరారు. మండలంలోని పూడివలసలో రీసర్వే పనులు ప్రారంభం కాగా శనివారం ఆ గ్రామంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రీ సర్వే గ్రౌండ్ ట్రూథింగ్ సమయంలో దగ్గరుండి హద్దులు చూపించుకొంటే తప్పులు దొర్లవని చెప్పారు. అదేవిధంగా విస్తీర్ణాలలో హెచ్చుతగ్గులు నివారించుకోవచ్చన్నారు. ఈ గ్రామంలో 62 సర్వే నంబర్ల పరిధిలో 2,535 ఎకరాల భూములున్నట్లు మండల సర్వేయర్ సతీష్ చెప్పారు. ఆయా భూములను రీ సర్వే చేయనున్నందున రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అప్పలనాయుడు, వీఆర్ఓ, గ్రామ సర్వేయర్ల బృందం , సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం..

రేగిడి: భూముల రీసర్వే ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తహసీల్దార్ కృష్ణలత అన్నారు. మండలంలోని చాటాయివలసలో రీ సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద ఉధృతి

సంతకవిటి: నాగావళి నదికి వరద ఉధృతి తగ్గిందని జలవనరుల శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు 45 వేల క్యూసెక్కుల మేర నీరు దిగువకు ప్రవహించిందని.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 22 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహించిందని ఏఈ చెప్పారు. కేఆర్ పురం గ్రామానికి వరద ముప్పు ఉంటుందనే భయంతో అధికారులు శుక్రవారం రాత్రి గ్రామంలోనే బస చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పాగిరిలో యువకుల హల్‌చల్


చేతికి అయిన గాయాన్ని చూపుతున్న బాధితుడు

రాజాం సిటీ: మండల పరిధి పాగిరి గ్రామంలో యువకులు శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. దీంతో గ్రామంలోని ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొనడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొంగు సాయికి వెదురు లోకేష్ అనే వ్యక్తి డబ్బులు బాకీ ఉన్నాడు. లోకేష్ విశాఖపట్నం నుంచి రైలులో వచ్చి శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో జి.సిగడాం రైల్వేస్టేషన్‌లో దిగాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన రౌతు రాంబాబు, పాగిరి ఉపేంద్రతో పాటు మరొక వ్యక్తి లోకేష్‌ను బాకీ డబ్బుల కోసం కొట్టారు. అనంతరం గ్రామానికి చేరుకున్న లోకేష్ రాత్రి 11.30 గంటల సమయంలో రాంబాబు, ఉపేంద్ర తల్లిదండ్రులను పిలిచి అడుగుతుండగా.. అక్కడే ఉన్న జడ్డు మాధవనాయుడు కలుగజేసుకుని లోకేష్‌ను ఒక్కడిని చేసి కొట్టడం సరికాదని వారించాడు. దీంతో అక్కడే ఉన్న రాంబాబు, ఉపేంద్రలు ఇంట్లోకి వెళ్లి కొడవలి, కత్తి తీసుకుని వచ్చి మాధవనాయుడును బెదిరించడంతో పాటు కాలితో తన్ని కొడవలితో గాయపర్చారు. విషయం తెలుసుకున్న మరో యువకుడు గొర్లె ఉపేంద్ర వీరిని విడిపించే ప్రయత్నం చేయగా ఇతనిపై కూడా రౌతు రాంబాబు దాడి చేశాడు. గాయపడిన మాధవనాయుడును గ్రామానికి చెందిన సిరిపురపు రమణ మోటార్ సైకిల్‌పై చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- ఫ్యాప్టో నాయకులు జేసీ రాజు, కె. ప్రసన్నకుమార్


ఎంఆర్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు


బొబ్బిలి రూరల్: చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

రామభద్రపురం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఫ్యాప్టో నాయకులు జేసీ రాజు, కె. ప్రసన్నకుమార్ ఆరోపించారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ భవనం ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగిస్తుండడంతో చదువులు అటకెక్కుతున్నాయన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుతో పాటు 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న ఆందోళనకు ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి. రవికుమార్, కేశవరావు, సుధాకర్, శంకరరావు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి

బొబ్బిలి రూరల్: ఈ నెల 7న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎల్. సాయిశ్రీనివాస్, సెక్రటరీ ఎస్. చిరంజీవి, కో చైర్మన్లు మనోజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రకాశరావు, విజయగౌరి, తదితరులు పాల్గొన్నారు.